

పిహెచ్‌సిలో వైద్య బృందం తనిఖీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్ క్యు ఏఎస్ వైద్య బృందం సభ్యులు, వైద్యులు రాజేష్ కన్నా, సుశీల దత్తాత్రేయ కవాడి శుక్రవారం పర్యటించి సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సౌకర్యాలు, మందుల గదులు, ఓపి తో పాటు గర్భిణీ ప్రసవాలపై అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు నజీబ్, అంబిక, ఎం పి హెచ్ ఈవో శౌరి, వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

గ్రామ సభల్లో అభివృద్ధి పనుల గుర్తింపు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జన జాతీయ గౌరవ దివస్ క్రింద శుక్రవారం పాడేరు మండలం కిండంగి గ్రామంలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, ఆయా గ్రామాలకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన వనరులు గుర్తించి అభివృద్ధి చేయడానికి ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలకు పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం, తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, 2005 కు ముందునుంచి స్వాధీనంలో ఉన్న భూమికి అటవీ హక్కుల చట్టం కింద హక్కులు కల్పించడం జరుగుతుందని వివరించారు. యువతకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించడం జరుగుతుందని తెలిపారు. బిర్సా ముండా చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతి అధికారి లవరాజు, డివిజినల్ పంచాయతి అధికారి పి.ఎస్ కుమార్, పిరమాల్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

డుంబ్రిగుడ:- బిర్సా ముండ జయంతిని పురస్కరించుకొని మండలంలోని కోర్రాయి పంచాయతీ సచివాలయంలో శుక్రవారం సర్పంచ్ పూజారి కొములు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండ చిత్రపటానికి స్థానిక పంచాయతీ సర్పంచ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పంచాయితీ నిధులతో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై వార్డు సభ్యులతో చర్చించారు. పంచాయతీకి మంజూరైన నిధులతో వార్డు సభ్యులు, పంచాయతీ గిరిజనులు సమన్వయంగా ఉంటూ అభివృద్ధి పనులు చేసుకోవాలని సర్పంచ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ప్రత్యూష, వీఆర్వో కోటేశ్వరరావు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రహదారి నిర్మాణం

బిల్లులు మార్చుకున్న కాంట్రాక్టరు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని డౌనూరు పంచాయతీ పరిధి ఉసిరికపాడు గ్రామానికి గత ప్రభుత్వంలో రహదారి మంజూరు కాగా, కాంట్రాక్టరు అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం చేసి బిల్లులు మార్చుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉసిరికపాడు గ్రామానికి గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి గతేడాది కోటీ రెండు లక్షల రూపాయలు నాటి ప్రభుత్వం మంజూరు చేసింది. దీని కాంట్రాక్టరు పూర్తిస్థాయిలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేయకుండా అప్పటికే ఉన్న మట్టి దారిలో గోతులు ఉన్న దగ్గర గ్రావెల్ వేసి మమ అనిపించారు. అంతే కాకుండా రహదారి మార్గంలో అక్కడక్కడ పెద్ద బండ రాళ్లు ఉండగా వాటిని బ్లాస్టింగ్ కూడా చేయకుండా అలాగే వదిలేశారు. ఈ మార్గంలో నిర్మించాల్సిన కల్వర్టులు కూడా నిర్మించలేదు. దీంతో రోడ్డు మొత్తం పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడి అధ్వానంగా, నరకప్రాయంగా తయారైంది. రోడ్డు నిర్మాణం పూర్తిస్థాయిలో చేయకుండానే సదరు కాంట్రాక్టరు బిల్లులు మార్చుకున్నట్లు ఉసిరికపాడు గ్రామస్తులు పి.రాజబాబు, జి.నాగేశ్వరరావు, జి.సింహాచలం, పి.సుబ్బారావు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులను అడిగితే కాంట్రాక్టర్ బిల్లు మార్చుకున్నట్లు చెబుతున్నారని, పూర్తి స్థాయిలో రహదారి నిర్మాణం చేయకుండా అధికారులు బిల్లులు ఎలా మంజూరు చేశారని వారు ప్రశ్నిస్తున్నారు.

ఇటీవల కాలంలో భారీ వర్షాల కారణంగా రోడ్డు కొట్టుకుపోయి గొయ్యిలుగా మారింది. రహదారి అధ్వానంగా ఉండడంతో పిఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన గృహాలు నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ తెచ్చుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులను, అనారోగ్యం పాలైన వారిని డోలి మోత సహాయంతో 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న డౌనూరు పీహెచ్సీకి తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పండించిన పంటలు వారపు సంతకు తీసుకెళ్లాలన్నా, నిత్యావసరాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేసి తెచ్చుకోవాలన్నా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో గతంలో వలే శ్రమదానంతో ఈ రహదారికి మరమ్మతులు చేస్తున్నామని వాపోయారు. ఈ విషయాన్ని అధికారుల, ప్రజా ప్రతినిధుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్ళినా ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణం చేయాలని, లేదంటే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



కాలిబాటను తలపిస్తున్న రహదారి, మధ్యలో తీయకుండా వదిలేసిన బండరాయి వద్ద సరి చేస్తున్న గిరిజనులు



శ్రమదానంతో రహదారి గోతులను పూడ్చుతున్న స్థానికులు

గిరిజన సహకార సొసైటీలు ఏర్పాటు చేసి..

యువతకు ఉపాధి కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్య పడాల్



మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-చింతపల్లి :- పర్యాటక అభివద్ధి పేరుతో గిరిజనులకు వచ్చే లక్షల ఆదాయం ప్రభుత్వం లాగేసుకుంటుందని, గిరిజన సహకార సొసైటీలతో నిరుద్యోగ సమస్య, ఆర్థికాభివృద్ధి సాధ్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. సిపిఎం 7వ మండల మహాసభ లంబసింగి పంచాయతీ చెరువుల వెనం గ్రామంలో మండల కమిటీ సభ్యుడు సాగిన చిరంజీవి, నాగేంద్రల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, గిరిజన సహకార సొసైటీలు ఏర్పాటు చేయడంతో స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గిరిజన నిరుద్యోగ యువతకు ఆర్థిక అభివృద్ధి చేకూరుతుందన్నారు. అనంతగిరి, అరకులో పర్యాటకం అభివృద్ధిని ఐటీడీఏ ఆధీనంలో ప్రభుత్వం నడిపిస్తూ లక్షల రూపాయలు ఆదాయం వస్తున్నా అందులో పని చేసే గిరిజన కార్మికులకు చాలీ చాలని వేతనాలు ఇస్తున్నారని మండిపడ్డారు. డుంబ్రిగూడ మండలం చాపరాయి, జి.మాడుగుల మండలం కొక్కిరపల్లిలో స్థానిక గిరిజన కార్మికులను నియమించుకొని ఏడాదికి అరకొర వేతనాలు ఇస్తున్నారన్నారు. ఏడాదికి నాలుగు నెలలు మాత్రమే పని చూపిస్తూ మిగిలిన ఏడాదంతా నెలలో సగం జీతంతో పని చేయిస్తున్నారని విమర్శించారు. చాపరాయిలో ఏడాదికి కోటి రూపాయలు, కొక్కిరపల్లి జలపాతం వద్ద 50 లక్షలు ఆదాయం వస్తుందని ఇందులో సగం డబ్బులు కూడా గిరిజన కూలీలకు చెల్లించకుండా ఐటిడిఎ దోచుకుంటుందని మండిపడ్డారు. చింతపల్లి మండలం చెరువుల వెనం వ్యూ పాయింట్ కూడా ఐటీడీఏ స్వాధీనం చేసుకోవాలని చూస్తుందని, గిరిజన సహకార సంఘాలు ఏర్పాటు చేసి స్థానిక యువతకే పర్యాటక ప్రాంతాలు అప్పజెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

సిపిఎం మండల కార్యదర్శిగా ధనుంజయ్

అనంతరం నిర్వహించిన మండల కార్యదర్శి ఎన్నికలో పాంగి ధనుంజయ్ మండల కార్యదర్శిగా మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా సాగిన చిరంజీవి, మర్రి నాగేంద్ర, సుందర్‌రావు, కనకవల్లిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గిరిజన సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.



పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

ప్రజాశక్తి-చింతూరు

పరిసరాల పరిశుభ్రత అందరూ బాధ్యతగా తీసుకోవాలని చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ అన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చట్టి జంక్షన్‌లో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అన్ని డిపార్టుమెంట్స్ అధికారులతో కలిసి పిఒ శ్రమదానం చేశారు. అనంతరం చట్టి షాపు యజమానులతో మాట్లాడారు. షాపుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి గుంపనపల్లి మోహన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బుచ్చిబాబు, ఏపీవో శ్యామ్, చింతూరు గ్రామ సచివాలయం సెక్రటరీ ప్రసాద్, వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త తొలగిస్తున్న చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు

రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి

-కలెక్టర్‌కు జెడ్‌పిటిసి గంగరాజు వినతి

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని అనంతగిరి మండలం మారుమూల ప్రాంతమైన గుమ్మ పంచాయితీ కర్రిగోడ, కడరేవు గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని శుక్రవారం పాడేరులో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు అనంతగిరి జడ్పిటిసి సభ్యులు దీసరి గంగరాజు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ గ్రామాల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా కలెక్టర్కు వివరించారు. అత్యవసర వేళల్లో ప్రజలకే కాకుండా ఆయా గ్రామాల్లో పర్యటించే అధికారులకు కూడా డోలీ మోత తప్పడం లేదని వివరించారు. గురువారం అక్కడ పర్యటించిన అనంతగిరి ఎంపిడిఓకి కూడా డోలిమోత పరిస్థితి ఎదుర్కొన్నారని చెప్పారు ఫారెస్ట్ అనుమతులు ఇచ్చి నందున రోడ్డు ప్రారంభించాలని కోరారు. అనంతగిరి మండలంలో గుమ్మ పంచాయితీ మారుమూల గ్రామాలు కర్రిగోడ కడరేవు, కొట్టెంగ్ గుడ, గొపులపాలెం, మర్రిబంద గ్రామాలకు రోడ్డు సౌకర్యం ప్రజలకు అందుబాటులో తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుమ్మ పంచాయత ప్రతినిధులు కురడబోయిన గంగారావు, గిరిజన సంఘం నాయకులు రాప్ప.రాజారావు, బి.రాజారావు, దేముడు, సురేష్ బాబు పాల్గొన్నారు.



బహుమతులు ఇస్తున్న జోనల్ కమిటీ కన్వీనర్

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అడపవలస జిపిఎస్ పాఠశాలలో ఐసిఆర్ స్పోర్ట్స్ జోనల్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 14 వరకు ఆటల పోటీలను నిర్వహించి శుక్రవారం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఐ సి ఆర్ స్పోర్ట్స్ జోనల్ కమిటీ కన్వీనర్ బి.అనిల్ కుమార్ విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు. అనంతరం గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై కూడా దృష్టి సారించి రాణించాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసానికి ఎంతో దోహద పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐ సి ఆర్ స్పోర్ట్స్ జోనల్ కమిటీ సభ్యులు శ్రీకాంత్, మహాదేవ్, సింహాద్రి, భారతి, మధు, రమేష్, విద్యా కమిటీ చైర్మన్ రామ్మూర్తి పాల్గొన్నారు.

విఆర్‌ఎలు పోరాటాలకు సిద్ధం కావాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాణిశ్రీ, వెంకట్

ప్రజాశక్తి-అడ్డతీగల

తమ సమస్యలపై విఆర్‌ఎలు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం విఆర్‌ఎలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాణిశ్రీ, వెంకట్ మాట్లాడుతూ వీఆర్ఏలకు ప్రభుత్వం అతి తక్కువ వేతనాలు ఇచ్చి వారి చేత వెట్టిచాకిరి చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నప్పుడల్లా అదనపు పనులను వీఆర్ఏల మీద వేస్తున్నాయన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా వీఆర్ఏలు వేతనాలు పెరగకపోవడంతో వారు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా టిడిపి కూటమి ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలు పరిష్కారం దిశగా ఆలోచన చేయాలని కోరారు. విఆర్ఎలకు తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్నట్లుగా పే స్కేలు అమలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా అమలు చేస్తున్న నైట్ డ్యూటీలు, అదనపు పనులు రద్దు చేయాలని, వీఆర్వో, అటెండర్, వాచ్‌మేన్, రికార్డ్ అసిస్టెంట్ తదితర ఖాళీ పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలని, నామినేలుగా వచ్చిన వీఆర్ఏలను వీఆర్ఏలుగా గుర్తించాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శాంతిరాజు, సహాయ కార్యదర్శి నిర్మల, విఆర్ఎలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ సున్నంవారి గూడెం పాఠశాలలో గురువారం యుటిఎఫ్ మండల మహాసభ జరిగింది. యుటిఎఫ్ ఐటీడీఏ సబ్ కమిటీ సభ్యులు యు.వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు డివివి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాసభలో మండల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులుగా జె.బాబురావు, అధ్యక్షులుగా కె.వెంకటేశ్వరరావు, సహాయ అధ్యక్షులు ఓ.మంగారావురెడ్డి ఎం.విజయ, ప్రధాన కార్యదర్శిగా ఎన్.జగదీష్, కార్యదర్శులుగా ఎస్.అజయ్ కుమార్, పి.రామారావు, పి.రాజయ్య, ఎస్.చంద్రరావు, టి.అర్జున్, కోశాధికారిగా ఎం.బాబు, ఆడిటర్‌గా ఎన్ రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యుటిఎఫ్ మండల మహిళా సబ్ కమిటీ కన్వీనర్‌గా టి విజయ్ కుమారి, సభ్యులుగా కె.పోచమ్మ, కె.శారద, యస్.రమ్య, సిహెచ్.శాంత కుమారి, సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్‌గా టి.రాము, సభ్యులుగా రమేష్ బాబు, గురుసాయి నవీన్, యస్.రమేష్, కె.రమేష్, యస్.వీర్రాజు ఎన్నికయ్యారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక కమిటీ కన్వీనర్‌గా పి.లింగారెడ్డి, సభ్యులుగా ఎ.రాము, ఎన్.ప్రసాద్, ఎం.వీరయ్య, యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథక కమిటీ కన్వీనర్‌గా ఎన్.ప్రసాద్, సభ్యులుగా సీతారామరాజు, ఆర్.సుబ్బారావు, జెసిజెవిఎస్ నాయుడు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎస్.రాజు, పాఠశాల హెచ్‌ఎంలు యస్.అబ్బులు, పి.రాజారావు, యుటిఎఫ్ మాజీ అధ్యక్షులు యం భీమయ్య, పలువురు సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న యుటిఎఫ్ మండల కార్యవర్గం



జలతరంగిణికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు

జల తరంగిణి పున:ప్రారంభం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండలం జిఎం వలస పంచాయతీ పరిధిలో గల జలతరంగిణి జలపాతాన్ని మారేడుమిల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం.ఏడుకొండలు శుక్రవారం పున:ప్రారంభించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 22వ తేదీన జల తరంగిణి వద్ద వరద ప్రవాహానికి ముగ్గురు మెడికల్ విద్యార్థులు కొట్టుకుపోయి మరణించిన విషయం తెలిసిందే. అప్పటి నుండి సుమారు రెండు నెలలపాటు జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు జల తరంగిణి జలపాతాన్ని మూసి వేశారు. ఈ జలపాతం వద్ద పర్యాటకులకు ఎటువంటి ప్రమాదాలు సంభవించికుండా అటవీ శాఖ అధికారులు తగిన జాగర్తలు తీసుకొని, ఎక్కడికక్కడ హెచ్చరిక బోర్డులు, జలపాతం ప్రవాహం వద్ద ఐరన్ మెస్‌తో భద్రతా వలయాలు ఏర్పాటు చేశారు. అనంతరం శుక్రవారం జలపాతానికి ప్రవేశ కల్పించారు పర్యాటక ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను పరిశీలించి, అందులోని సూచనలు పాటించాలని, పర్యాటకలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే హెచ్చరిక బోర్డుపై ఉన్న టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ పట్టాభి, బీట్ ఆఫీసర్స్, కోఆర్డినేటర్ వీరబాబు, సిబిటి సిబ్బంది పాల్గొన్నారు.

అరకు కాఫీకి టాటా సంస్థ మార్కెటింగ్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని అరకు కాఫీ ప్రాధాన్యతను గుర్తించి ప్రముఖ వాణిజ్య సంస్థ టాటా సంస్థ మార్కెటింగ్ చేయడానికి ముందుకు రావడం హర్షనీయమని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఐటిడిఎలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో టాటా సంస్థ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంస్థకు కావలసినంత మేర కాఫీ గింజలు అందించడం జరుగుతుందని, సంస్థ ఆశించిన స్థాయిలో గ్రేడింగ్ చేయిస్తామని తెలిపారు. ఆర్గానిక్, ఇనార్గానిక్ వేరు చేయడం జరుగుతుందని, ప్రస్తుతం సరైన మార్కెటింగ్ లేక గిరిజన రైతులు దళారులను నమ్మి మోషపోతున్నందున నూతన మార్కెటింగ్ విధానాలను అన్వేషిస్తున్నామని ఇటువంటి సమయంలో టాటా సంస్థ ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. సంస్థ ప్రతినిధులు కాఫీ లోగో గురించి ఆరా తీయగా కలెక్టర్ స్పందిస్తూ లోగో రూపొందించి కాఫీ రైట్స్ తీసుకుంటామని హామీ ఇచ్చారు.

టాటా గ్రూప్ ఎక్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అండ్ బిజినెస్ హెడ్ అమిత్ పంత్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా పాడేరు ఏజన్సీ ప్రాంతంలో పర్యటించి ఇక్కడ పండుతున్న కాఫీ నాణ్యతలను పరిశీలించామని కాఫీ పంట బాగుండడమే కాకుండా ఆర్గానిక్ విధానంలో పండిస్తున్నారని తెలిపారు. ఐటిడిఎ, జిసిసి తరుపున కాఫీ కొనుగోలు, బ్రాండింగ్ కు సిద్ధంగా ఉన్నామని, రైతులకు అవసరమైన శిక్షణలు అందించి కాఫీ పంటకు అదనపు విలువలు జోడించే విధంగా ఐటిడిఎ, జిసిసి, కాఫీ బోర్డు, రైతులకు అన్నివిధాల సహకరిస్తామని వివరించారు. అరకు కాఫీకి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న విషయాన్ని గుర్తించామని తెలిపారు. ఈ సమావేశంలో టాటా గ్రూప్ మార్కెటింగ్ లీడ్ మేనేజర్ వెంకటేష్ బాబు, ఐటిడిఎ ఎపిఓ (పిటిజి) ఎం. వెంకటేశ్వరరావు, కాఫీ బోర్డ్ సీనియర్ లైజన్ అధికారి రమేష్, కాఫీ ఎడి అశోక్, జిసిసి పాడేరు, చింతపల్లి డిఎంలు సింహాచలం, దేవరాజు, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు ఎస్బిఎన్ నంద్, రమేష్ కుమార్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

ప్రజాశక్తి-హుకుంపేట: పీఎం జన్ మన్ పథకంలో భాగంగా ఇల్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ బాబు కోరారు. మండలంలోని గడికించమండ పంచాయతీ గడ్డిమరి గ్రామంలో శుక్రవారం సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. పాత ఇల్లులను తొలగించి వేగవంతంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పివిటిజి గిరిజనులకు ఇళ్లకు సంబంధించిన నిధులు ఉన్నాయని త్వరితగతిన నిర్మాణాలు చేపడితే బిల్లులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఈశ్వరి, భాను పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ బాబు

బిర్సా ముండాకు ఘన నివాళి


చింతపల్లిలో నివాళి

ప్రజాశక్తి-పాడేరు: బ్రిటిష్ వలస పాలనను వ్యతిరేకిస్తూ గిరిజనులకు నాయకత్వం వహించి గిరిజనుల తరుపున పోరాడిన మహా నేత భగవాన్ బిర్సా ముండా ఆదర్శప్రాయుడని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కొనియాడారు. శుక్రవారం బిర్సా ముండా 150వ జయంతిని పురష్కరించుకుని ఐటిడిఎ ప్రాంగణంలో బిర్సా ముండా విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజన హక్కులు, అటవీ హక్కులపై గిరిజనులను చైతన్య పరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.జే అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్,


హుకుంపేటలో నివాళి అర్పిస్తున్న నేతలు

డిఎంహెచ్ఓ జమాల్ బాష, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి సూర్యలక్ష్మి, ఐటిడిఎ ఎపిఓ వెంకటేశ్వరరావు, ఎఓ హేమలత, గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ ఉపసంచాలకులు కుమారి రజని, పాల్గొన్నారు.

అరకులోయరూరల్: మండలంలోని మాడగడ గ్రామ పంచాయితీ వంతుమూరు గ్రామంలో బిర్సాముండా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బిర్సాముండా సమావేశం మందిరం సర్పంచ్ పిబి జ్యోతి ప్రారంభించారు.అనంతరం పంచాయతీ పరిధిలో చేయనున్న అభివృద్ధి కార్యక్రమాలను చర్చించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వైసిపి నాయకులు బాలరాజు, వైస్ సర్పంచ్ కిల్లో గాసి, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

హుకుంపేట:మండలంలోని చీకుమద్దుల పంచాయితీ పెదనంది పుట్టు గ్రామంలో బిర్సా ముండాకు జయంతిని. పంచాయితీ సెక్రెటరీ అప్పన్న, సర్పంచ్ సూకూరు బొంజన్న దొర ఆధ్వర్యంలో నిర్వహించారు.వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, బ్రిటిష్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గిరిజన ప్రజలకు చైతన్యం చేసి వీరోచిత పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ రమేష్‌బాబు, వెటర్నరీ అసిస్టెంట్ సన్యాసిరాజు, సర్వేయర్ సంజీవ్ రాజు, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మణ్ రాజు, వార్డ్ మెంబర్ లు జన్ని పవన్ కుమార్, పీసా నాయకులు జన్ని అప్పల స్వామి, గెమ్మెలి కామేష్, మర్రి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

చింతపల్లి:బలపం పంచాయతీలో బిర్సా ముండా జయంతి సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పోతురాజు కామరాజు, సచివాలయం కన్వీనర్ జి.మోహన్ , వెల్ఫర్ అసిస్టెంట్ శ్రీను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చిరంజీవి, అగ్రికల్చర్ సౌందర్య సర్వేయర్ జమునా, వెటర్నరీ బాలమురళి, మాజీ వాలంటరీ రామకృష్ణ పాల్గొన్నారు.
వంగసార గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిర్సా ముండా జీవిత గాథను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

పెదబయలు : గురుకుల బాలుర పాఠశాలలో ప్రిన్సిపాల్ సూర్యశంకర్‌రావు ఆధ్వర్యంలో బిర్సాముండా చిత్ర పటానికి పూలమాల వేశారు.అడవిపై సర్వ హక్కులు పొందుటకు అనాడు బ్రిటిష్ వారితో యుద్ధం చేసారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ చిట్టిబాబు, ఉపాధ్యాయుడు మేడారం రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న బిర్సా ముండా, గిరిజనుల సమస్యలపై అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లిశేఖర్, అధ్యాపకులు నూనె రమేష్, బి.శ్రీనివాసరావు, జి.వెంకట్రావు, ఆర్‌సిహెచ్.నాగేశ్వరరావు, జి.హారతి, ఎస్.అప్పనమ్మ, కె.శకుంతల, కె.శైలజ, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, ఆర్.మౌనిక, జి.సాయికుమార్, పి.అలివేలు, పి.సుభద్ర, బి.సంగం నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం సర్పంచ్ పీట సింహాచలం ఆధ్వర్యంలో బిర్సా స్వాతంత్ర్య 150 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ, పీసా కమిటీ కార్యదర్శి కాకర స్వామి నాయుడు, పంచాయతీ కార్యదర్శి మౌనిక కమల, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


చింతూరు డిగ్రీ కళాశాలలో...

మీకోసంలో 87 వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు : స్తానిక సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేధికకు 87 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ సంయుక్తంగా అర్జీదారుల నుండి 87 వినతులను స్వకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన సమయానికి ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు.

కొన్ని ఫిర్యాదులు :

జి.మాడుగుల మండలం గాడుతూరు పంచాయితీ పచ్చనపల్లి గ్రామానికి చెందిన అరకు దానియేలు తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కింద ఇల్లు మంజూరు చేయాలని వినతి పత్రాలను సమర్పించారు. కొయ్యూరు మండలం భూధరాళ్ళ పంచాయతీ చీడిపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో 65 పట్టదారులు ఉన్నారని, ఆన్లైన్‌లో నమోదు కోరుతూ వినతి పత్రంలో పేర్కొన్నారు. ముంచింగిపుట్టు మండల కరఖపుట్ పంచాయతీ రాకాసిరాయి గ్రామానికి చెందిన కిల్లో రాముల్లమ్మ తమ గ్రామం లో అశ వర్కర్ పోస్ట్ ఖాళీ ఉన్నందున ఆమెకు ఉపాధి కోరుతూ వినతి పత్రం సమర్పించారు. కొయ్యూరు మండలం బాలారం పంచాయతీ కొత్తబాలారం గ్రామానికి చెందిన కలేపు సుబ్బారావు వికలాంగుడు ట్రై - సైకిల్ మంజూరుకు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బి. ఎస్. నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు, సెరీ కల్చర్ ఎడి అప్పారావు, రహదారులు భవనాల శాఖ ఇఇ బాల సుందర బాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు జి.డేవిడ్ రాజు, కె.వేణు గోపాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, జిల్లా విద్యాశాఖ అధికారి పీ.బ్రహ్మాజీ, ఎల్ డి ఎం మాతు నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జి ఉప సంచాలకులు ఎల్.రజని, ఐసి డి ఎస్ పి.డి. సూర్య లక్ష్మి, ఏపిఓ వెంకటేశ్వరరావు, ఐటిడి ఏ పరిపాలనాధికారి ఎం.హేమలత పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్ కు 13 దరఖాస్తులు

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరములో నిర్వహించిన ఎంప్లాయిస్ గ్రీవెన్స్ కు 13 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులు పరిశీలించిన కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆయా ఫిర్యాదులపై వారంలోగా తగు చర్యలు తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. ముందుగా సంయుక్త కలెక్టర్ ఎం.జే అభిషేక్ ఫిర్యాదులు స్వీకరించారు. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి నాలుగు, వైద్య ఆరోగ్య శాఖకు మూడు, విద్యా, పంచాయతి శాఖలకు రెండేసి, రెవెన్యు, విధ్యుత్ శాఖలకు ఒక్కొక్క ధరఖాస్తులు అందాయి..



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పాఠశాలల్లో ప్రయివేటు ఈవెంట్లకు అనుమతిస్తే చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో ప్రభుత్వ నిర్వహణలో పాఠశాలల ప్రాంగణంలో రాజకీయ, మతపరమైన, వివాహాలు, ఇతర ప్రవేట్ ఈవెంట్లకు అనుమతిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో కొంతమంది ఆర్ జె డి ఎస్ ఈ, డీఈవోలు, హెడ్ మాస్టర్లు ఇటువంటి కార్యకలాపాలకు అనుమతిస్తున్నట్లు ప్రభుత్వ దృష్టికి వచ్చిన నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. ఈ సూచనలను ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు

జిల్లాలోని మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణానికి రూ.రెండు వేల కోట్ల ప్రభుత్వానికి ప్రతిపాదన చేస్తామని దీనిపై స్పష్టత ఉండాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ శాఖల, పథకాల ద్వారా నిర్మించనున్న రహదారులు డూప్లికేట్ కాకుండా చూడాలన్నారు. వివిధ ఇంజినీరింగ్ విభాగాల వారు డిపిఆర్, టెండర్ ప్రక్రియ, చెల్లింపులకు అనుసరిస్తున్న విధి విధానాలను అడిగి తెలుసుకున్నారు. పిఎం జన్ మన్ కింద పివిటిజి గ్రామాలకు మంజూరైన 185పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

జన్ మన్ లో చేపట్టలేని పనులను ఎన్ఆర్ఇజిఎస్ కింద చేపట్టడానికి ప్రతిపాదించాలని అన్నారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రతి 15 రోజులకు నిర్మాణ ప్రగతి తెలుసుకునే విధంగా ఫొటోలు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమీక్షలో ప్రధాన కేంద్రం నుండి ఆర్ అండ్ బి, పంచాయతి రాజ్, గిరిజన సంక్షేమ తదితర శాఖల ఇంజినీరింగ్ అధికారులు, మండలాల నుండి ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు కట్టా సింహాచలం, భరత్, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక కేజీబీవీ వద్ద వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ భాషా మాట్లాడుతూ, ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు వహించాలన్నారు. విద్యతోపాటు ఆరోగ్యం ప్రాముఖ్యమన్నారు. అనారోగ్యంగా ఉన్నవారిని దగ్గరలో ఉన్న సి.హెచ్.సి లేదా ఏరియా హాస్పిటల్, డి.ఈ.ఐ.సి, జిజిహెచ్‌కు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సాయి మోహన్ రెడ్డి, ఆర్ బి ఎస్ కే మేనేజర్ వై.కిషోర్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ ఎలీషా పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తకాల ప్రదర్శన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పుస్తకాల ప్రదర్శన నిర్వహించారు. పలు రకాల పుస్తకాలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాలు విజ్ఞాన దేవాలయాలని, ప్రతిరోజు విద్యార్థులు గ్రంథాలయంలో సందర్శించి విలువైన పుస్తకాలను చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత చెప్పారు. కార్యక్రమంలోఅధ్యాపకులు సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -అనంతగిరి:బిరిస ముండా స్ఫూర్తితో గిరిజన హక్కులు చట్టలు కాపడతామని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు ఎంపీపీ శెట్టి. నీలవేణి అనంతగిరి పంచాయతీ శివాలయం స్థానిక సర్పంచ్ సోమ్మెల. రూతు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు దీనికి ముందు బిరిస ముండా 150 వ జయంతి కార్యక్రమం నిర్వహించరు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నేతలు మాట్లాడుతూ 1/70 చట్టం అటవీ హక్కులు. పేసా వంటి చట్టలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా అమలు చేయాలని కోరారు ఈ గ్రామసభల ముఖ్య ఉద్దేశం ఆ సట్టాలపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలో ఉన్న అన్ని సచివాలయ కేంద్రాలలో ఈ సభలు నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు హాజరై గిరిజన హక్కులు చట్టాలపై తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సిహెచ్ దేవా. గిరిజన సంఘం మండల నాయకులు ఎస్ నాగులు. సచివాలయం సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.


రహదారులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - చింతపల్లి : మండల కేంద్రంలోని ప్రశాంతినగర్ వీధిలో సిమెంట్ రహదారి నిర్మాణానికి ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటీసీ పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతల శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, జనసేన నాయకులు వంతల బుజ్జిబాబు, కిముడు కృష్ణమూర్తి , టిడిపి అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, రీమల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ యూనియన్ నాయకులు శుక్రవారం తహశీల్దారు, ఎంపిడిఒ, ఐసిడిఎస్ సిడిపిఒలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు అచ్చమ్మ, ఎల్.ముత్యాలమ్మ మాట్లాడుతూ ఐసిడిఎస్‌కి నిధులు పెంచాలని, ప్రీ స్కూల్‌ను బలోపేతం చేయాలని కోరారు. అన్ని అంగన్వాడీ కేంద్రాలు పక్కా భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, పిల్లలకు ఇస్తున్న మెనూ క్వాలిటీ పెంచాలని, సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని, అద్దె భవనాల్లో ఉండే అంగన్వాడీ సెంటర్లకు ప్రతి నెలా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డి.వెంకట రమణమ్మ, పి వెంకటరమణ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.


వ్యర్థాల తొలగింపులో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి పంచాయతీ సెక్రెటరీ పి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ఫ్రైడే డ్రై డే సందర్భంగా శుక్రవారం శ్రమదానం చేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ సెంటర్ నుండి కాఫీ తోటలు జంక్షన్ వరకు (జిఎంవలస జంక్షన్) సుమారు రెండు కిలోమీటర్లు మేర రోడ్డుకి ఇరువైపులా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది, యువత శ్రమదానం

మండలంలోని సున్నంపాడు సచివాలయ ఉద్యోగులు, ఆ గ్రామ యువత కలిసి శుక్రవారం శ్రమదానం చేశారు. మారేడుమిల్లి నుండి రంపచోడవరం వెళ్లే ప్రధాన రహదారిలోని బర్డ్స్ నెస్ట్ రిసార్ట్ దగ్గర్లో ఉన్న కొండవాగు రోడ్డు మీదకు ప్రవహిస్తుండడంతో రోడ్డు మొత్తం పాడైపోయి, వాహనదారుల అవస్థలు పడుతున్నారు. దీనిని యువత ముందడుగు వేసి శ్రమదానం ద్వారా రోడ్డుమీద పారుతున్న నీటికి దారి మళ్ళించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ యువత పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయం

ప్రజాశక్తి-సీలేరు : కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం జీకే వీధి మండలం సీలేరు శివాలయం భక్తులతో కిక్కిరిసింది. సీలేరు సమీపంలో ఉన్న నదిలో భక్తులు సూర్యోదయం కాకముందే స్నానాలు ఆచరించి, అనంతరం శివాలయంలో పూజలు చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో కార్తీక నోములు ఆచరించారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

అభివృద్ధి పనులు వేగవంతం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిసి రోడ్లు, గోకులం షెడ్లు, ఇతర అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ ఆదేశించారు. ఉపాధి హామీ చట్టంలో మంజూరై నిర్మాణంలో ఉన్న పెందుర్తి మండలం సరిపల్లి, జంగాలపాలెం, పెదగాడి గ్రామ పంచాయతీల్లోని సిసి రోడ్లు, గోకులం షెడ్‌ల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం జిల్లా సమైఖ్య ప్రాంగణంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పర్యవేక్షక ఇంజినీర్లు, డివిజనల్ ఇంజినీర్లు, క్లస్టరు అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, అదనపు ప్రోగ్రాం అధికారులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగ కార్యక్రమంలో భూమి పూజ చేసి ప్రారంభించబడిన అన్ని సిసి రోడ్లు, గోకులం షెడ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆమోదించి ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలని, లేనియెడల ప్రభుత్వం రద్దు చేస్తుందని చెప్పారు.

అనకాపల్లి జిల్లాలో మంజూరైన 1142 సిసి రోడ్లు, 851 గోకులం షెడ్లను, విశాఖపట్టణం జిల్లాలో 140 సిసి రోడ్లు, 151 గోకులం షెడ్లను సంక్రాంతికి ముందుగా పూర్తి చేయాలన్నారు. పూర్తి కాబడిన పనులకు పేమెంట్‌నకు ఎఫ్‌టిఒలు జనరేట్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పథక సంచాలకులు ఆర్.పూర్ణిమాదేవి, విశాఖ జిల్లా నీటి యాజమాన్య సంస్థ సూపరింటెండింగ్ ఇంజినీర్ శ్రీనివాస్, అనకాపల్లి జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి వీరు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్ల తొలగింపు అడ్డగింత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : వాల్తేరు కోటక్ స్కూల్ రైల్వే గెస్ట్ హౌస్ ఫుట్‌పాత్‌పై ఉన్న తోపుడు బండ్లను తొలగించేందుకు జివిఎంసి అధికారులు పూనుకోగా సిఐటియు ఆధ్వర్యాన తోపుడు బండ్ల కార్మికులు శుక్రవారం అడ్డుకున్నారు. ఉదయం 10 గంటలకు జోన్ 3 టౌన్ ప్లానింగ్ ఎసిపి ఆధ్వర్యాన టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కలిసి తోపుడు బండ్లు తొలగించడానికి వచ్చారు. వారి వెంట పోలీసులనూ తీసుకొచ్చారు. ఈ క్రమంలో 15 సంవత్సరాల నుంచి ఇక్కడే తోపుడు బండ్లు పెట్టుకుని తామంతా బతుకుతున్నామని, తమను తొలగించడం అన్యాయమని పేర్కొంటూ కార్మికులంతా నిరసన తెలియజేస్తూ వారిని అడ్డుకున్నారు. 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం.. ఎక్కడ వ్యాపారం చేసుకునే తోపుడు బండ్లు కార్మికులను అక్కడే బతకనీయాలని ఉన్న విషయాన్ని తోపుడుబండ్లు కార్మిక సంఘం మద్దిలపాలెం జోన్ గౌరవాధ్యక్షులు పి.వెంకట్రావు గుర్తుచేశారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ ట్విట్టర్ కంప్లైంట్ ద్వారా చిల్లర వర్తకులను జివిఎంసి అధికారులు తొలగించడం అన్యాయమన్నారు. ప్రొక్లయిన్, లారీలు, సిబ్బందితో వచ్చి బలవంతంగా, నోటీసులు ఇవ్వకుండా తోపుడుబండ్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోబోమని, జివిఎంసి ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. తక్షణం కోటక్ స్కూల్ తోపుడు బండ్లు కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించి వెండింగ్ జోన్ ఏర్పాటు చేయాలని జివిఎంసి కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో సిఐటియు మద్దిలపాలెం జోన్ సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు, చిన్న వాల్తేర్ కోటక్ స్కూల్ తోపుడుబండ్లు కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.అప్పారావు, కె.రాజు, తోపుడు బండ్లు కార్మికులు పాల్గొన్నారు



జెసిబిని అడ్డుకుంటున్న తోపుడు బండ్ల కార్మికులు

తోపుడుబండ్ల తొలగింపును ఆపాలి : సిపిఎం

తోపుడు బండ్ల తొలగింపును ఆపి, చిరు వ్యాపారులకు ఉపాధి రక్షణ కల్పించాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జాతీయ రహదారిని ఆక్రమించిన బడా వాణిజ్య వ్యాపారులను వదిలేసి చిరు వ్యాపారులపై పడటం తగదన్నారు. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, పవన్ కల్యాణ్, టిడిపి నేతలంతా ఈ దాడులను ఆపాలని డిమాండ్ చేశారు.

ఆస్తి విలువ ఆధారిత పన్నును రద్దు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆస్తి విలువ ఆధారిత ఆస్తి పన్నును రద్దు చేయాలని కోరుతూ వార్వా ప్రధాన కార్యదర్శి బి.బి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి సిఎం చంద్రబాబుకు లేఖ రాశారు. ఆ వివరాలను శుక్రవారం మీడియాకు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లపై వసూలు చేసే ఇంటి పన్ను 2021లో ఇంటి అద్దె విలువ ఆధారిత ఇంటి పన్ను నుండి ఆస్తి విలువ ఆధారిత ఆస్తి పన్నుగా మార్చబడిన విషయాన్ని గుర్తుచేశారు. ఇంటి పన్నును కాస్త ఆస్తిపన్నుగా మార్చేయడం అన్యాయం, అశాస్త్రీయమని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఆస్తి పన్ను జిఒను సమీక్షిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని కోరారు.


సోషల్ మీడియాపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చినబాబు

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : సోషల్ మీడియా పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని జడ్డంగి ఎస్ఐ చినబాబు అన్నారు. మండలంలోని అమీనాబాద్ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ చినబాబు మాట్లాడుతూ సోషల్ మీడియా, ఇంటర్నెట్ ప్రభావాలకు సంబంధించి ప్రస్తుత పరిస్థితుల గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలోని వివిధ వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలో వివరించారు. విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థినిలకు వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్తగా రామలక్ష్మి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : కాంగ్రెస్ పార్టీ రంపచోడవరం నియోజకవర్గం కో-ఆర్డినేటర్‌గా పల్లాల రామలక్ష్మిని అధిష్టానం నియమించినట్లు ఆ పార్టీ జిల్లా నాయకులు, రాజవొమ్మంగి మండల అధ్యక్షులు మహమ్మద్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శతక బుల్లిబాబు సూచన మేరకు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి, పల్లాల రామలక్ష్మిని నియమించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు పల్లాల రామలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి పని చేసే వారికి పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ అలీ అన్నారు.

ఉసిరి, మారేడు, మర్రి మొక్కలు నాటండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతి ఒక్కరూ ఉసిరి, మారేడు, మర్రి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమార స్వామి కోరారు. శుక్రవారం సాయంత్రం ఎంవిపి కాలనీలోని ఎస్‌విపి డిగ్రీ కళాశాలలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం నేతృత్వంలో మొక్కలు నాటిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

ఎఐ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్స్ విశాఖపట్నం సెంటర్ ఆధ్వర్యంలో విశాఖ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎఐ ఎక్స్‌పో - 2024 శుక్రవారం ఉదయం బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైంది. ఎంపీ శ్రీభరత్ జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇంటీరియర్ డిజైన్స్ ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి నూతన ఉత్తేజం కలుగుతుందని ఆయన అన్నారు. ఎక్స్‌పోలోని టైల్స్, లైటింగ్స్, వాల్ ఇంటీరియర్ డిజైన్స్ విశాఖపట్నం ప్రజలను ఎంతో ఆకర్షిస్తాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్స్ విశాఖపట్నం సెంటర్ చైర్మన్ రాజేష్ నాగుల, కార్యదర్శి రాంజీ ఎ ఉత్తాడ పాల్గొన్నారు.

ఎఫ్ఎపిసిసిఐ ఆధ్వర్యాన జిఎస్‌టిపై సెమినార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్ఎపిసిసిఐ) ఆధ్వర్యంలో జిఎస్‌టిలోని పలు అంశాలపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఎఫ్ఎపిసిసిఐ అధ్యక్షులు కంకటాల మల్లికార్జునరావు, గుంటూరు సిజిఎస్‌టి ఆడిట్ కమిషనరేట్ ఐఆర్ఎస్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొని పలు సూచనలు చేశారు.